క్లుప్తంగా

నేటి నుంచి రాజశ్యామల యాగం



కొనసాగుతున్న ఏర్పాట్లు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ గ్రామంలోని తమ నివాసంలో రాజశ్యామల మహాయాగానికి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన యాగం ఏర్పాట్లను పరిశీలించారు. ఈయాగం గురువారం నుంచి ఈనెల 26వ తేదీ వరకు ఆరు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. శ్రీ శృంగేరీ పీఠం ఆస్థాన పండితులు, ప్రవచన నిధి డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో 30 మందికి పైగా ఈ మహాయాగంలో పాల్గొంటారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఇన్‌స్పెక్టర్ సతీష్‌కు సన్మానం



ఇన్‌స్పెక్టర్‌కు బొకే అందజేస్తున్న కౌన్సిలర్లు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సతీష్‌ను జల్‌పల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు బుధవారం ఘనంగా సన్మానించారు. స్టేషన్ పరిధిలో నేరాల నివారణకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా రాత్రిపూట గస్తీని ముమ్మరం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, శంకర్, మజ్హర్ అలీ, బీఆర్ఎస్ నాయకులు ఇక్బాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాజన్ సంపర్క్ అభియాన్‌కు తరలిరండి

బీజేపీ శ్రేణులకు అందెల పిలుపు



బీజేపీ నాయకులతో అందెల శ్రీరాములు

బడంగ్‌పేట్: బీజేపీ రాష్ట్ర నాయకత్వ పిలుపు మేరకు గురువారం ఉదయం 7 గంటల నుంచి మహాజన్ సంపర్క్ అభియాన్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ తెలిపారు. నాదర్‌గుల్‌లోని 9వ డివిజన్ నుంచి యాత్ర ప్రారంభం అవుతుందని అన్నారు. ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి విచ్చేసి సంపర్క్ అభియాన్ ను ప్రారంభిస్తారని తెలిపారు. ప్రధాని మోడీ తొమ్మిదేళ్ల పాలనలో దేశాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి చేపట్టిన పథకాలు, తీసుకున్న నిర్ణయాల గురించి ప్రజలకు తెలపాలన్నారు. అలాగే ముఖ్యమంత్రి కేసీఆర్ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడతామన్నారు. పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు పనుల పరిశీలన

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కమాన్ నుంచి నాదర్‌గుల్ వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులను బుధవారం మేయర్ చిగురింత పారిజాత పరిశీలించారు. రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బీటీ రోడ్డుతో ప్రయాణికుల కష్టాలు తీరుతాయని మేయర్ వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈ అశోక్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇబ్రాంశేఖర్, నాయకులు

బడంగ్‌పేట్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని బడంగ్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ తెలపారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్, బడంగ్‌పేట్, బాలాపూర్, మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది పదవ తరగతిలో 9.0 నుంచి 9.5 జీపీఏ సాధించిన విద్యార్థుల ఫోటోలతో వాల్‌పోస్టర్లు సొంతంగా ముద్రించి బుధవారం ఇబ్రాం శేఖర్ ఆవిష్కరించారు. ఈ వాల్‌పోస్టర్లను అన్ని ప్రైవేట్ స్కూళ్ల ముందు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పోలీస్ స్టేషన్ల ఎదుట తహసీల్దార్ కార్యాలయాల ఎదుట అతికించి విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులకు అవగాహన కల్పిస్తామని వెల్లడించారు. పిల్లలను ప్రభుత్వ స్కూళ్లల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు.

చరిత్ర ఘనం.. అభివృద్ధి శూన్యం



నాదర్‌గుల్‌లోని సున్నం చెరువు

- సుందరీకరణకు నోచుకోని సున్నం చెరువు
- బాలాపూర్ మండలంలోనే అతిపెద్ద చెరువుగా గుర్తింపు
- బతుకమ్మ, గణేశ్ నిమజ్జనం సమయంలోనే హడావుడి
- అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలంలోని 13 గ్రామాలల్లో అతిపెద్ద రెవెన్యూ విస్తీర్ణంతో పాటు బడంగ్‌పేట కార్పొరేషన్‌లో అతిపెద్ద చెరువుగా గుర్తింపు పొందిన సున్నం చెరువు అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. చరిత్ర ఘనం.. అభివృద్ధి శూన్యం అన్న చందంగా తయారయ్యింది సున్నం చెరువు పరిస్థితి. వివరాల్లోకి వెళ్తే.. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో సర్వే నంబర్లు 733, 734, 727, 725 నుంచి 723 వరకు ఉన్న ఈ నంబర్లల్లో సుమారు 72 ఎకరాల్లో సున్నం చెరువు ఆవరించి ఉంది. మొదటినుంచి సున్నం చెరువు మంచినీటి చెరువు ఇప్పటికి మంచినీటి చెరువుగానే కొనసాగుతున్నది. కొంతమేర కాలనీలు చెరువు అంచున ఏర్పాటు అయినప్పటికీ డ్రైనేజీ నీటిని మాత్రం చెరువులోకి కలవకుండా ఏర్పాటు చేశారు. గతంలో ఈ చెరువు నిండితే బడంగ్‌పేట గ్రామంలోని కుంటలు, వాగులు, బావులు నిండేవి. సున్నం చెరువుకు బడంగ్‌పేటకు అవినావభావ సంబంధం ఉండేదని స్థానికులు అంటుంటారు.

శరవేగంగా మిగితా చెరువుల అభివృద్ధి..

బాలాపూర్ మండలంలోని జిల్లెలగూడలోని చందన చెరువు, మీర్‌పేట్‌లోని మంత్రాల చెరువు, అలాగే అల్మాస్‌గూడలోని పోచమ్మకుంట చెరువు, కోమటి కుంట చెరువు, కుర్మల్‌గూడలోని అంతిరెడ్డి చెరువు, గుర్రంగూడలోని పెద్ద చెరువులన్నీ బ్యూటిఫికేషన్‌కు అర్హత సాధించాయి. కోట్ల రూపాయాల నిధులతో సుందరీకరణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. వాటిని అన్ని హంగులతో అభివృద్ధి చేసేందుకు చకచకా పనులు కొనసాగుతున్నాయి.

అన్ని పండుగలు ఇక్కడే..

గత మూడేళ్లుగా కురుస్తున్న వర్షాలకు సున్నం చెరువు నిండుకుండలా మారి ఇప్పటికీ అలుగుపారుతూనే ఉంది. బాలాపూర్ మండలంలోనే గణేష్ నిమజ్జనం చేసే ఏకైక చెరువుగా సున్నం చెరువు గుర్తింపు పొంది ఇక్కడే నిమజ్జనాలకు ప్రత్యేక క్రేన్లు ఏర్పాటు చేస్తారు. అలాగే బతుకమ్మ పండుగకు కూడా పెద్ద లైట్ల మధ్య ఇక్కడే సద్దుల బతుకమ్మలు, ఇతర పండుగలు చేస్తుంటారు. ప్రభుత్వం మత్స్యకారులకు ఉపాధి చూపెట్టేందుకు చేపలు వదిలిపెట్టారు. మృగశిరకార్తె నాడు చెరువుకట్టపై పెద్ద సందడే ఉంటుంది. ఇన్ని ప్రత్యేకతలు ఉన్నప్పటికీ సున్నం చెరువు సుందరీకణను చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సున్నం చెరువు బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



మంచినీటితో అలరారే సున్నం చెరువు బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలి. దసరా, దీపావళి, మృగశిర కార్తెకు ఈ చెరువుకట్టపై ప్రత్యేక ఏర్పాట్లు చేయిస్తున్నారు. అన్ని చెరువులకు నిధులు కేటాయిస్తున్నట్లే సున్నం చెరువుకు కూడా ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి.

– నిమ్మల సునీత, కార్పొరేటర్, 9వ డివిజన్

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి సబితారెడ్డి

మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గానికి వరాల జల్లులు కురిపించిన సీఎం కేసీఆర్‌కి ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామం మ్యాక్ ప్రాజెక్టు సమీపంలో రూ.7 కోట్ల నిధులతో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. తుమ్మలూరులో జరిగిన సభలో సీఎం కేసీఆర్ మహేశ్వరం నియోజకవర్గానికి మొత్తంగా రూ.160.90 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి అభివృద్ధి చూడలేదన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్త, ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునీతా నాయక్, కందుకూరు జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కందుకూరు పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, తుమ్మలూరు గ్రామ సర్పంచ్ సురేఖారెడ్డి, ఉపసర్పంచ్ శ్రీహరి, బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రాజు, రాజు నాయక్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు

మంత్రి సబితారెడ్డిపై బీజేపీ నేత శంకర్‌రెడ్డి ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

బడంగ్‌పేట్: ప్రజలు, వర్గాల మధ్య చిచ్చు పెడుతూ మంత్రి సబితారెడ్డి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం బడంగ్‌పేట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, బీసీ కార్పొరేషన్లు నిర్వీర్యం చేసి తాత్కాలిక దళితబంధు, లక్ష రూపాయల పథకాల పేరుతో ఎస్సీ, బీసీ కులాల ఆత్మగౌరవాలను అవమానపరుస్తున్నారని ఆరోపించారు. ట్యాక్సులు, రిజిస్ట్రేషన్లు, ఎల్ఆర్ఎస్ నిధులతోనే మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి అంటున్నారే కాని రాష్ట్ర నిధులు ఎన్ని తెచ్చారో శ్వేతపత్రం విడుదలచేయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ వచ్చి అభివృద్ధికి రూ.150 కోట్లు నజరానా ప్రకటించడం ఉట్టిమాటేనని అన్నారు. రూ.4లక్షల కోట్ల కేంద్ర నిధులు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేటాయిస్తే మోడీ ఏమి ఇవ్వలేదని అంటారా అని ప్రశ్నించారు. నేటి ఉదయం 7 గంటల నుంచి 'ప్రజా మహా సంపర్క్ అభియాన్' పేరుతో ఇంటింటికి తిరిగే కార్యక్రమం ప్రారంభమవుతుందని అన్నారు. సుమారు 20 లక్షల గృహాలు తిరిగి కేంద్రం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మహేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రవికుమార్ తదితతరులున్నారు.

ప్రభుత్వ బడికి రూ.3.5 లక్షల విరాళం



కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

దాతను సన్మానించిన ఉపాధ్యాయులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడ ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. విషయం తెలుసుకున్న నాదర్‌గుల్ వంశీధర్ స్కూల్ చైర్మన్ కంకణాల కృష్ణారెడ్డి రూ.3.5 లక్షలు సాయంగా అందించి ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మార్చారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని విద్యాదినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం వంశీధర్ స్కూల్ చైర్మన్ కృష్ణారెడ్డిని స్థానిక కార్పొరేటర్ బొద్రమోని రోహిణి, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పాఠశాలకు మరిన్ని సేవలు అందిస్తామని కృష్ణారెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ గోదాలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్ఞానవనం నిర్మాణానికి శంకుస్థాపన

ఆమనగల్లు: మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామంలో తెలంగాణ బ్లాక్ వాయిస్ ఆధ్వర్యంలో నిర్మించే జ్ఞానవనం నిర్మాణానికి వార్డు సభ్యులతో కలిసి సర్పంచ్ పద్మయాదయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజలను జ్ఞానంవైపుగా తీసుకువెళ్లడానికి జ్ఞానవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. జ్ఞానవనంలో పార్క్, జిమ్, బుద్ధ విగ్రహం ఏర్పాటు చేస్తామని.. ఉచిత ఇంటర్నెట్ సదుపాయం ఉంటుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యాదయ్య, శ్రీనివాస్, జంగయ్య, మహేశ్, రమేశ్, రాములు, వెంకటయ్య, పార్వతమ్మ, గ్రామ కార్యదర్శి తిరుపతి, తెలంగాణ బ్లాక్‌వాయిస్ ప్రతినిధులు వరుణ్, శివరాజ్, సుశాంత్, అరుణ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

ఆమనగల్లు: అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్ కమటం రాధమ్మ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీ, సంకటోనిపల్లి గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌తో కలిసి కౌన్సిలర్ రాధమ్మ ప్రారంభించారు. మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ కింద మంజూరైన రూ.15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆమె వివరించారు. రూ.30 లక్షలతో 8వ వార్డులో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు ఆమె చెప్పారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కౌన్సిలర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ భార్గవ్‌రెడ్డి, నాయకులు బాలయ్య, అనంతరాములు, యాదగిరి, పెద్దయ్య, మల్లేశ్, నారయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

- జెడ్పీటీసీ జంగారెడ్డి
- ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం

కందుకూరు: బీఆర్ఎస్ సర్కార్, సీఎం కేసీఆర్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుంతుందని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం కందుకూరు మండలంలోఆధ్యాత్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన గూడూరులోని వేంకటేశ్వరస్వామి దేవాలయం, మసీద్‌లో, బాచుపల్లిలోని చర్చిలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, సర్పంచ్‌లు శ్రీనివాస్, శ్రీలత, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ఎంపీటీసీలు రాములు, సురేష్, సీనియర్ నాయకులు దశరథ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు లచ్చానాయక్, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

మీర్‌పేట: ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



జీపుజాత వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రవికుమార్, అంగన్‌వాడీలు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యాక్షుడు రవికుమార్

మహేశ్వరం: అంగన్‌వాడీ ఉద్యోగులకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగుల జీపుజాత పోస్టర్‌ను ఆయన ఉద్యోగులు, కార్మిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రద్దు చేయాలని, 45వ ఐఎల్‌సీ ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి , పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల జీపుజాత ఈ నెల 16న ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల మీదుగా జీపు జాత జరుగుతుందన్నారు. ముగింపు సభ 30న మహేశ్వరం మండల కేంద్రంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ శేఖర్, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీ, పవిత్ర ,జ్యోతి, దివ్య, అనిత పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

కందుకూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో స్వామి శ్రీనివాస్ గురూజీ ఆధ్వర్యంలో యోగ ఆసనాలు వేయించి, ధాన్యం, యోగా ప్రాముఖ్యతను గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్‌గౌడ్ పాల్గొన్నారు. జైత్వారంలో మాజీ సర్పంచ్ పర్వతాలుయాదవ్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, గ్రామస్తులకు యోగాసనాలు నేర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం పుష్ప, వార్డు సభ్యుడు సిద్దుగౌడ్, యోగా టీచర్ శారద తదితరలు పాల్గొన్నారు. కొత్తగూడలోని శ్రీనికేతన్ స్కూల్‌లో ఆచార్య రమేష్ గురూజీ విద్యార్థులకు యోగా పాఠాలు నేర్పించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ శేఖర్‌గౌడ్, ప్రిన్సిపాల్ వేణు, శారద, సిద్దేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో టీకేఆర్ కళాశాలలో టీకేఆర్ వాకర్స్ అసోసియేషన్ సౌజన్యంతో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు మాధవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేష్, వెంకటేశ్వర్లు, మంజుల, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాధవరావు, అమరేందర్‌రెడ్డి, విజయ పాల్గొన్నారు.

న్యూగాయత్రీనగర్‌లో..

న్యూగాయత్రినగర్‌లో స్థానిక కార్పొరేటర్ మద్ది సబితా రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొని యోగా విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్లు గోవర్ధన్‌రెడ్డి, నీలారవినాయక్, కాలనీ అధ్యక్షులు ప్రభాకర్‌రావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట: వేడుకల్లో పాల్గొన్న మేయర్ పారిజాత

శ్రీ త్రివేణిలో..

హుండాకాంప్లెక్స్: సరూర్‌నగర్ శ్రీ త్రివేణి విద్యా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ గోవర్ధన్‌రెడ్డి , ప్రిన్సిపాల్ సునీల్, యోగేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.



హుడా కాంప్లెక్స్: యోగాసనాలు వేస్తున్న త్రివేణి పాఠశాల విద్యార్థులు



మీర్‌పేట: యోగాసనాలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులు



కందుకూరు: యోగా గురువును సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



మీర్‌పేట: న్యూగాయత్రినగర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు